
26-2-26 RAKSHANA_praja jyothi Medhak.qxd 2/26/2026 4:58 AM Page 1

# గౌరవ ప్రద స్వాగతం

**గవర్నర్‌కు ఘన స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారీయా..**



వివరాలు 4లో..

మన రాజధాని
# రక్షణ
నిజం మా బలం

బాపట్ల | గుంటూరు | పల్నాడు

గురువారం 26 ఫిబ్రవరి 2026 | పేజీలు : 4

# "నాకేం తెలియదు"

- ▶కలెక్టర్‌కు తెలియకుండానే నిర్ణయాలా?
- ▶కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలు అమలు కానట్టేనా...?
- ▶"నాకేం తెలియదు" అంటున్న సంబంధిత అధికారులు
- ▶ బాధ్యత ఎవరిది...?
- ▶మున్సిపల్, పంచాయతీ ఎన్నికల ముందు గందరగోళం

**జిల్లాలో ఎన్నికల నిర్వహణకు కీలకమైన ఈఆర్వో ఏఈఆర్ఓ డేటా ఎంట్రీ ఆపరేటర్ల మార్పుపై తీవ్ర గందరగోళం నెలకొంది. కేంద్ర ఎన్నికల కమిషన్ స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ, ఏడు సంవత్సరాలు దాటిన సిబ్బందిని మార్చాలన్న నిబంధనలు అమలుకాకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. సంబంధిత అధికారులు "మాకు ఆర్డర్లు రాలేదు" అంటూ బాధ్యత నుంచి తప్పించుకునే ప్రయత్నం చేయడం అనుమానాలకు తావిస్తోంది. ఈ వ్యవహారం జిల్లా కలెక్టర్ దృష్టికి వెళ్లకుండానే జరుగుతోందా అన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.**




రక్షణ జిల్లా బ్యూరో

జిల్లాలో ఎన్నికల ప్రక్రియలో కీలక బాధ్యతలు నిర్వర్తించే డేటా ఎంట్రీ ఆపరేటర్ల నియామకాలు, మార్పుల విషయంలో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో అప్పటి కలెక్టర్ వెంకట మురళి ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సర్కులర్ జారీ చేసినట్లు సమాచారం ఉన్నప్పటికీ, ఆ సర్కులర్ అమలులోకి వచ్చిందా లేదా అన్న దానిపై స్పష్టత లేదు. ఈ విషయంపై రక్షణ ప్రతినిధి సంబంధిత అధికారి అయిన షఫీని సంప్రదిస్తే "ఈఆర్ఓ నుంచి ఆదేశాలు రాలేదు"

వివరాలు 2లో..


# అక్షర ఆంధ్రకు శత విజయం

- మార్చి 15న ఫైనల్ పరీక్షలు
- నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యం
- జిల్లా కలెక్టర్లకు కోన శశిధర్
- స్పష్టమైన దిశానిర్దేశం









ఉల్లాస్--అక్షర ఆంధ్ర కార్యక్రమంలో చదువు నేర్చుకుంటున్న లబ్ధిదారులందరూ నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలని విద్యాశాఖ రాష్ట్ర ప్రత్యేక కార్యదర్శి కోన శశిధర్ ఆదేశించారు. మార్చి 15న జరిగే ఫైనల్ పరీక్షలపై అన్ని జిల్లాల కలెక్టర్లకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు.

వివరాలు 2లో..

# ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యం



**గంజాయి రహిత బాపట్ల దిశగా వినూత్న ప్రచారం**

**జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఆదేశాలతో ఆటోలు అవగాహన రథాలు**

**మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రజా భాగస్వామ్యానికి పిలుపు**



జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు బాపట్ల పోలీసులు గంజాయి రహిత జిల్లా లక్ష్యంగా ఆటోలను ప్రచార వాహనాలుగా మార్చి మాదకద్రవ్యాల నిర్మూలనపై వినూత్న అవగాహన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వివరాలు 2లో..

# పంచాయతీ భవనాలను తనిఖీ చేస్తున్న అధికారులు.



వివరాలు 2లో..

కేంద్ర పంచాయతీరాజ్ అదనపు కార్యదర్శి గుంటూరులో జిల్లా వనరుల భవనం, గ్రామ పంచాయతీ నిర్మాణ పనులను పరిశీలించారు.

# "నాకేం తెలియదు"

మొదటి పేజీ తరువాయి

అని సమాధానం. "మాకు ఎవరూ చెప్పలేదు, మార్పు చేయాలంటే ఫిర్యాదు చేయాలి" అంటూ పత్రిక ప్రతినిధులతో మాట్లాడడం విస్మయానికి గురిచేస్తోంది. ఇది అమాయకత్వమా? లేక నిబంధనలపై అవగాహన లోపమా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.కేంద్ర ఎన్నికల కమిషన్ స్పష్టంగా ఏడు సంవత్సరాలు దాటిన డేటా ఎంట్రీ ఆపరేటర్లను వెంటనే మార్చాలని ప్రత్యేక జీవో జారీ చేసినప్పటికీ, జిల్లా స్థాయిలో ఆ ఆదేశాలు పట్టించుకోకపోవడం గమనార్హం. ఎవరికి వారే సర్కులర్లు జారీ చేసుకుంటూ ఎన్నికల నిబంధనలను తుంగలో తొక్కుతున్నారా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.డేటా ఎంట్రీ ఆపరేటర్లే ఓటర్ల జాబితా, జనాభా లెక్కలు, ఎన్నికల గణాంకాల నిర్వహణలో కీలకం. రానున్న మున్సిపల్, పంచాయతీ ఎన్నికల ముందు ఇలాంటి పరిస్థితి కొనసాగితే ఎన్నికల పారదర్శకతపై ప్రభావం పడే అవకాశం ఉందని ప్రజల్లో చర్చ జరుగుతోంది.ఈ వ్యవహారంపై పూర్తి అధికారాలు జిల్లా కలెక్టర్ వద్ద ఉన్నట్లు సమాచారం. అయితే కింది స్థాయి అధికారులు విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లకుండానే వ్యవహరిస్తున్నారా? లేక కలెక్టర్‌కు తెలియకుండానే నిర్ణయాలు జరుగుతున్నాయా? అన్నది స్పష్టత కావాల్సి ఉంది.

ప్రజల్లో, అధికార వర్గాల్లో ఒకే అభిప్రాయం వ్యక్తమవుతోంది --- ఈ అంశంపై జిల్లా కలెక్టర్ స్వయంగా జోక్యం చేసుకొని సమగ్ర విచారణ జరిపితేనే నిజాలు బయటపడతాయని. అప్పటివరకు అనుమానాల మబ్బులు వీడే పరిస్థితి కనిపించడం లేదు.

# ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యం

మొదటి పేజీ తరువాయి

**బాపట్ల రక్షణ బ్యూరో**

మాదకద్రవ్యాల మహమ్మారిని పూర్తిగా నిర్మూలించాలనే దృఢసంకల్పంతో బాపట్ల జిల్లా పోలీసులు వినూత్న అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లా పోలీసు అధికారి బి. ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు పాత బస్టాండ్ కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి ఆటో డ్రైవర్లను ప్రచార సారథులుగా ఎంపిక చేశారు.

ఈ కార్యక్రమానికి పి. జగదీష్ నాయక్ ఆధ్వర్యం వహించగా, పట్టణ ఇన్స్పెక్టర్ ఆర్. రాంబాబు, ఈగల్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు. డ్రగ్స్ వలన కలిగే దుష్పరిణామాలపై ఆటో డ్రైవర్లకు సమగ్ర అవగాహన కల్పించి, ప్రత్యేకంగా రూపొందించిన పోస్టర్లను ఆటోల లోపల, బయట అతికించారు. పాఠశాలలు, కళాశాలలు మాత్రమే కాకుండా సామాన్య ప్రజలకు సైతం చైతన్యం కలిగించాలనే ఉద్దేశంతో ఈసారి ఆటోలను ప్రచార మాధ్యమాలుగా ఎంచుకోవడం విశేషం. రోజూ వందలాది మంది ప్రయాణించే ఆటోల ద్వారా డ్రగ్స్ ప్రమాదాలపై సందేశం ప్రతి ఇంటికీ చేరేలా చర్యలు తీసుకున్నారు.

అధికారులు మాట్లాడుతూ, ఆటో డ్రైవర్లు పట్టణంలోని ప్రతి ప్రాంతానికి చేరుకుంటారని, కాబట్టి వారు సమాజ రక్షణలో కీలక భాగస్వాములవ్వాలని కోరారు. ఎక్కడైనా గంజాయి వినియోగం లేదా విక్రయం గమనించినట్లయితే వెంటనే 1972, 112 నంబర్లకు లేదా సమీప పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

జిల్లాను గంజాయి రహితంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఎస్పీ ఉమామహేశ్వర్ ఆధ్వర్యంలో మరిన్ని వినూత్న కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పోలీసులు తెలిపారు.

# అక్షర ఆంధ్రకు శత విజయం

మొదటి పేజీ తరువాయి

**గుంటూరు / బాపట్ల: రక్షణ ప్రతినిధి**

అక్షరాస్యతతో పాటు డిజిటల్ ఆర్థిక అక్షరాస్యత పెంపే లక్ష్యంగా అమలు చేస్తున్న ఉల్లాస్--అక్షర ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విద్యాశాఖ రాష్ట్ర ప్రత్యేక కార్యదర్శి కోన శశిధర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా చదువు నేర్చుకున్న లబ్ధిదారులందరూ శత శాతం ఉత్తీర్ణత సాధించేలా జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు.రాజధాని అమరావతి నుంచి బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర కమిషనర్ పి. రంజిత్ బాషాతో కలిసి కోన శశిధర్ అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. బాపట్ల జిల్లా నుంచి జిల్లా కలెక్టర్ వి. వినోద్ కుమార్ ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కోన శశిధర్ మాట్లాడుతూ, కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో గత నవంబర్ నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఉల్లాస్--అక్షర ఆంధ్ర కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో చదువు నేర్చుకున్న లబ్ధిదారుల ప్రగతిని అంచనా వేయడానికి మార్చి 15న ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ అసెస్మెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ పరీక్ష ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందని, లబ్ధిదారులు వారికి అనుకూలమైన సమయంలో పరీక్షా కేంద్రాలకు వచ్చి పరీక్ష రాయవచ్చని తెలిపారు. ఈ పరీక్ష మూడు గంటల పాటు జరుగుతుందని స్పష్టం చేశారు.పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారిని అక్షరాస్యులుగా గుర్తిస్తూ నేషనల్ లిటరసీ మిషన్ అథారిటీ, జాతీయ సార్వత్రిక విద్యాసంస్థల ద్వారా ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామని కోన శశిధర్ తెలిపారు. లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండా వారి గ్రామాల్లోనే పరీక్షలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా చదువు నేర్చుకున్న మహిళలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.ఇదే సమావేశంలో ఈ నెల 28న ప్రీ--ఫైనల్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ పరీక్షల ద్వారా లబ్ధిదారులు తమ స్థాయిని అంచనా వేసుకుని మార్చి 15న జరిగే ఫైనల్ పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా తీసుకుని జిల్లా కలెక్టర్లు, విద్యాశాఖ అధికారులు, వాలంటీర్లు సమిష్టిగా కృషి చేయాలని ఆదేశించారు.ఇదే సమయంలో గుంటూరు జిల్లాకు సంబంధించి జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా మాట్లాడుతూ, జిల్లాలో 90,426 మంది అక్షర ఆంధ్ర కార్యక్రమంలో నమోదు అయ్యారని, 9,043 మంది వాలంటీర్లు బోధన చేస్తున్నారని తెలిపారు. పలు కేంద్రాలను స్వయంగా సందర్శించి బోధన తీరును పరిశీలించామని, ప్రతి ఒక్కరూ ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక చర్యలు చేపట్టామని చెప్పారు.వీడియో కాన్ఫరెన్స్‌లో వయోజన విద్య, విద్యాశాఖ, జిల్లా పరిషత్, డీఆర్‌డీఏ, మహిళా శిశు సంక్షేమ శాఖల అధికారులు పాల్గొని అక్షర ఆంధ్ర కార్యక్రమ పురోగతిపై వివరాలు అందించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా అక్షరాస్యతలో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు సమిష్టి కృషి కొనసాగుతుందని అధికారులు తెలిపారు.

# వైఎస్ఆర్ విగ్రహాల ఏర్పాటుకు వినతి

**మాజీ సీఎం వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహ పునర్నిర్మాణానికి అనుమతి కోరుతూ కలెక్టర్‌ను కలిసిన వైఎస్ఆర్సీపీ నాయకులు**

**బాపట్ల రక్షణ న్యూస్**



బాపట్లలో మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహ పునర్నిర్మాణం, అలాగే ధ్రువ కాలవ సర్కిల్‌లో విగ్రహ స్థాపనకు అనుమతి మంజూరు చేయాలని కోరుతూ వైఎస్ఆర్సీపీ నాయకులు జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.బాపట్ల జిల్లా కేంద్రంలో ఉన్న కలెక్టరేట్‌లో గౌరవనీయులైన జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ గారిని కలిసి, కోన రఘుపతి గారి పిలుపుమేరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు తమ డిమాండ్లను వివరించారు.బాపట్ల మార్కెట్ యార్డు సమీపంలోని నేషనల్ హైవే వద్ద ఉన్న మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి గారి విగ్రహాన్ని పునర్నిర్మించేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. అదేవిధంగా, బాపట్ల ధ్రువ కాలవ సర్కిల్ వద్ద గతంలో అధికారుల తీర్మానం ప్రకారం వైఎస్ఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాల్సి ఉన్నదని గుర్తుచేస్తూ, వెంటనే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా బాపట్ల మండలం ఎంపీపీ చిన్న పోతుల హరిబాబు, జిల్లా వైఎస్ఆర్సీపీ ఉపాధ్యక్షులు కోకి రాఘవరెడ్డి, దివ్యాంగుల విభాగం అధ్యక్షులు చల్లా రామయ్య, యువజన విభాగం అధ్యక్షులు కొక్కిలిగడ్డ చెంచయ్య, మండల అధ్యక్షులు మరుప్రోలు కొండలరెడ్డి, ఇతర పార్టీ నాయకులు పాల్గొన్నారు.వైఎస్ఆర్ సేవలను స్మరించుకునే విధంగా విగ్రహాల ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని నాయకులు కోరగా, వినతిపత్రాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు.

# పంచాయతీ భవనాలను తనిఖీ చేస్తున్న అధికారులు.

మొదటి పేజీ తరువాయి

**గుంటూరు రక్షణ న్యూస్**

కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖకు చెందిన అదనపు కార్యదర్శి అశోక్ కుమార్ లోహాని, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ సంచాలకులు ఎం. కృష్ణ తేజతో కలిసి జిల్లా పంచాయతీరాజ్ వనరుల కేంద్ర భవనాన్ని పరిశీలించారు. కార్యాలయ నిర్వహణ, సదుపాయాల వినియోగం, అమలులో ఉన్న కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు.అనంతరం కొల్లిపర మండలం కుంచవరం గ్రామంలో నిర్మాణంలో ఉన్న గ్రామ పంచాయతీ భవనాన్ని తనిఖీ చేసి పనుల పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేశారు. నిర్మాణ పనులు నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా స్వచ్ఛ రథాన్ని ప్రారంభించారు. గుంటూరు విచ్చేసిన అదనపు కార్యదర్శిని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ టి. క్రిస్టినా సత్కరించారు.కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి. జ్యోతి బసు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి. శంకర్, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.


26-2-26 RAKSHANA_praja jyothi Medhak.qxd 2/26/2026 4:58 AM Page 3



# బాపట్ల లో జనసేన సభ్యత్వ శంఖారావం ప్రారంభం

**బాపట్ల రక్షణ న్యూస్**

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కొత్త సమీకరణలకు నాంది పలుకుతూ పవన్ కళ్యాణ్ నాయకత్వంలోని జనసేన పార్టీ 2026 సంవత్సరానికి సంబంధించిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఫిబ్రవరి 26 నుంచి ప్రారంభించనున్నట్లు ప్రకటించింది. పార్టీ బలోపేతం, గ్రామ స్థాయి విస్తరణ, యువత--మహిళల భాగస్వామ్యం పెంపు లక్ష్యంగా ఈ డ్రైవ్‌ను ఉద్యమాత్మకంగా చేపట్టాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో బాపట్ల పట్టణంలోని గౌతమ్ గ్రాండ్‌లో ఉత్సాహభరిత సన్నాహక సమావేశం నిర్వహించారు. జిల్లాలోని పలు మండలాల నుంచి నాయకులు, వీర మహిళలు, కార్యకర్తలు భారీగా హాజరై సభను విజయవంతం చేశారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన పత్సమట్ల ధర్మరాజు మాట్లాడుతూ, పవన్ కళ్యాణ్ ఇచ్చిన పిలుపు మేరకు ప్రతి కార్యకర్త ఇంటింటికీ వెళ్లి సభ్యత్వ నమోదు చేపట్టాలని సూచించారు. గ్రామ కమిటీలను బలోపేతం చేస్తూ జిల్లాను సభ్యత్వ నమోదులో అగ్రస్థానంలో నిలబెట్టాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, సభ్యత్వ నమోదు కేవలం సంఖ్యల పెంపు కాకుండా సిద్ధాంతాల వ్యాప్తికి నాంది అని పేర్కొన్నారు. యువత, మహిళలు, ఉద్యోగులు పెద్ద ఎత్తున పార్టీలో చేరి మార్పుకు భాగస్వాములు కావాలని కోరారు. బాపట్ల



నియోజకవర్గ నాయకుడు విన్నకోట సురేష్ ఆధ్వర్యంలో సమావేశం సమగ్ర ప్రణాళికతో నిర్వహించబడింది. వేదిక ఏర్పాట్లు, కార్యకర్తల సమీకరణ, ప్రచార వ్యూహాల రూపకల్పనలో ఆయన కీలక పాత్ర పోషించారు. రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, సభ్యత్వ డ్రైవ్‌ను ఉద్యమంలా నిర్వహించడం ద్వారా గ్రామ స్థాయిలో పార్టీ ప్రభావాన్ని పెంచడమే కాకుండా రాబోయే ఎన్నికల దిశగా బలమైన కేడర్ నిర్మాణం చేయాలనే వ్యూహాన్ని జనసేన అమలు చేస్తోందని భావిస్తున్నారు. మొత్తంగా, పవన్ కళ్యాణ్ పిలుపుతో ప్రారంభమైన ఈ సభ్యత్వ శంఖారావం బాపట్లలో ఘనంగా మార్మోగి, జిల్లాలో పార్టీ శక్తిని రెట్టింపు చేయాలనే సంకల్పాన్ని స్పష్టం చేసింది.

# పేదరిక లక్ష్యాల అమలుపై రాష్ట్ర స్థాయి సమీక్ష

**బాపట్ల రక్షణ న్యూస్**

రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళిక శాఖ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్ష సమావేశం జరిగింది. సమావేశంలో జిల్లా కలెక్టర్‌తో పాటు ప్రధాన ప్రణాళికాధికారి, వివిధ విభాగాల ప్రత్యేక అధికారులు, నియోజకవర్గ అధికార యంత్రాంగం పాల్గొన్నారు. సున్నా పేదరిక సాధనకు రూపొందించిన కార్యాచరణ రూపకల్పన అమలు, పనితీరు సూచికల పురోగతి అంశాలపై సమగ్రంగా చర్చించారు. గత సంవత్సరం నుంచి నిధులు నిలిచిపోయిన సూచికలు, అలాగే పల్నాడు జిల్లాలో అమలుకాని కొన్ని అంశాలను జిల్లా కలెక్టర్ రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చారు. ప్రస్తుత పరిస్థితుల్లో సాధ్యం కాని లక్ష్యాలకు తగిన మార్పులు చేసి పునర్వ్యవస్థీకరించేందుకు అనుమతి ఇవ్వాలని కోరగా, రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. ఇటీవల జరిగిన కలెక్టర్ల సమావేశంలో పరిశ్రమల రంగానికి సంబంధించిన జిల్లా స్థూల దేశీయోత్పత్తి పురోగతిని తగ్గ



దలగా చూపిన విషయంపై కూడా చర్చ జరిగింది. రాష్ట్ర స్థాయిలో ఉపయోగించిన ఉత్పత్తి గణాంకాలు సరిగ్గా లేవని జిల్లా కలెక్టర్ తెలియజేశారు. వాస్తవ గనుల ఉత్పత్తి వివరాలను సమర్పించి గణనలో సవరణలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశాలన్నింటిపై సంబంధిత శాఖాధిపతులకు సరైన ఆధారాలు, వివరణలతో కూడిన

# బాల్య వివాహాలపై అవగాహన సదస్సు

**బాపట్ల రక్షణ న్యూస్**

బాల్య వివాహాల నివారణపై అవగాహన కల్పించేందుకు రైలుపేట 6వ వార్డు గౌతమి ఉన్నత ప్రాథమిక పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శి షేక్ ముబీనా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖులు పాల్గొని విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. కార్యక్రమానికి జిల్లా బాలల సంరక్షణ అధికారి పురుషోత్తం, భావపురి విద్యాసంస్థల అధినేత ఆవల వెంకటేశ్వరరావు, పొందుగల ప్రసాదరావు రోజ్ సేవా సంస్థ కార్యదర్శి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి. కృష్ణకుమారి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల దుష్పరిణామాలు, విద్య ప్రాధాన్యత, బాలల హక్కులు వంటి అంశాలపై ప్రసంగించారు. పిల్లలు తమ చదువుపై దృష్టి సారించి బాధ్యతాయుతంగా ఎదగాలని, చిన్న వయసులో వివాహాలు చేయరాదని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం కలిసి బాల్య వివాహాల నిర్మూలనకు కృషి




చేయాలని పిలుపునిచ్చారు. పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# పారదర్శకంగా సర్వే నిర్వహించాలి

## ఎంపీడీఓ అద్దురి శ్రీనివాసరావు ఆదేశాలు



**కర్లపాలెం రక్షణ న్యూస్**

కర్లపాలెం మండలంలోని అన్ని గ్రామాల్లో కొనసాగుతున్న సర్వేలను వేగవంతం చేయాలని ఎంపీడీఓ అద్దురి శ్రీనివాసరావు పంచాయతీ సిబ్బందికి ఆదేశించారు. మండల పరిధిలోని చింతయపాలెం మరియు కర్లపాలెం పంచాయతీలను ఆయన సందర్శించి, అక్కడ జరుగుతున్న సర్వే కార్యక్రమాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. సర్వే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసే విధంగా పలు సూచనలు చేశారు. గ్రామాల వారీగా ప్రణాళికాబద్ధంగా పని చేసి, నిర్దిష్ట గడువులోపు సర్వేలను పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా సర్వేల్లో ఖచ్చితత్వం, పారదర్శకత పాటించాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమన్వయంతో పని చేయాలని ఎంపీడీఓ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# నైపుణ్యాభివృద్ది లో ఆధునిక కోర్సులకు ప్రాధాన్యం

## నైపుణ్య శిక్షణలో ఏఐ కోర్సులు కీలకం: కలెక్టర్ కృతిక శుక్లా



**నరసరావుపేట రక్షణ న్యూస్**

నరసరావుపేట జిల్లాలో సాంప్రదాయ నైపుణ్య శిక్షణ కోర్సులకు అదనంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)పై ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా అధికారులను ఆదేశించారు. డ్వాక్రా మహిళలు, కళాశాల విద్యార్థులు, నిరుద్యోగ యువత, వృత్తి విద్య అభ్యసించే అభ్యర్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించడం అత్యవసరమని కలెక్టర్ పేర్కొన్నారు. భవిష్యత్ ఉపాధి అవకాశాలను దృష్టిలో ఉంచుకుని ఏఐ శిక్షణను నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల్లో భాగం చేయాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమాల అమలుకు సెయింట్ ఫౌండేషన్ వంటి సంస్థల సహకారం తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతో శిక్షణను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో డీఆర్డీఏ పీడీ ఝాన్సీ రాణి, జిల్లా నైపుణ్యాధికారి తమ్మాజీ రావు, వ్యవసాయ అధికారి జగ్గారావు, సెయింట్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. జిల్లా స్థాయిలో ఆధునిక నైపుణ్యాలకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు.

## యువతి పిర్యాదుతో కానిస్టేబుల్ అరెస్ట్

**వేధింపుల కేసులో ఆర్టీసీ కానిస్టేబుల్‌కు 14 రోజులు రిమాండ్**



**చిలకలూరిపేట రక్షణ న్యూస్**

యువతిని వేధింపుల ఆరోపణల నేపథ్యంలో కృష్ణా జిల్లాకు చెందిన ఆర్టీసీ కానిస్టేబుల్‌ను పోలీసులు అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపర్చగా 14 రోజుల రిమాండ్ విధించబడింది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో పనిచేస్తున్న కానిస్టేబుల్ మేకల నరేంద్రపై నాదెండ్ల మండలానికి చెందిన ఓ యువతి ఫిర్యాదు చేసింది. తనను నిరంతరం వేధింపులకు గురిచేస్తున్నాడని, కానిస్టేబుల్‌తో పాటు మరో ఇద్దరిపై కూడా చర్యలు తీసుకోవాలని ఆమె ఫిర్యాదులో పేర్కొంది.ఫిర్యాదు ఆధారంగా నాదెండ్ల పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడు నరేంద్రను అరెస్టు చేశారు. ప్రభుత్వ ఉద్యోగిగా ఉండి చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడినందున కేసును ప్రాధాన్యంగా తీసుకున్నట్లు తెలిపారు.అనంతరం నిందితుడినిచిలకలూరిపేట కోర్టులో హాజరుపర్చగా, న్యాయస్థానం మేకల నరేంద్రకు 14 రోజుల రిమాండ్ విధించింది. కేసు దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు వెల్లడించారు.

## గౌరవ ప్రద స్వాగతం

మొదటి పేజీ తరువాయి

**గుంటూరు రక్షణ న్యూస్**

గుంటూరు జిల్లాకు విచ్చేసిన రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ కు జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా ఘన స్వాగతం పలికారు.చిన కొండ్రుపాడు ప్రాంతంలోని ఒక ప్రైవేట్ వైద్య కళాశాలలో నిర్వహించిన పట్టాభిషేకోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొనుటకు గవర్నర్ విచ్చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం తెలిపారు.జిల్లా పరిపాలన తరఫున గవర్నర్‌కు అవసరమైన ఏర్పాట్లు సమగ్రంగా చేపట్టినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమం గౌరవప్రద వాతావరణంలో విజయవంతంగా జరిగింది.

## మేస్త్రి తీరుపై కార్మికుల ఆగ్రహం

**జీతాలు చెల్లించకుండానే పనిలోకి రమ్మన్నారంటూ బైఠాయింపు**

**ప్రత్తిపాడు రక్షణ న్యూస్**



ప్రత్తిపాడు పంచాయతీలో పారిశుధ్య కార్మికులు, మేస్త్రి ప్రవర్తనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బకాయి జీతాలు పూర్తిగా చెల్లించే వరకు పనిలోకి రావద్దని చెప్పిన మేస్త్రి, ఇప్పుడు ట్రాక్టర్‌లో చెత్త ఎత్తించడం ఏంటని కార్మికులు ప్రశ్నించారు.

కార్మికుల వేతనాల వ్యవహారం రోజురోజుకీ ముదురుతున్న నేపథ్యంలో, మేస్త్రి ఆదేశాలపై మండిపడిన సిబ్బంది చెత్తతో నిండిన ట్రాక్టర్ ముందే బైఠాయించారు. ట్రాక్టర్ ముందుకు కదలకుండా నిరసన చేపట్టడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.మొత్తం జీతాలు చెల్లించకుండానే పనులు చేయాలని ఒత్తిడి తేవడం అన్యాయమని కార్మికులు ఆరోపించారు. తాము ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, వేతనాలు లేకుండా కుటుంబాలను పోషించడం కష్టమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.కార్మికుల నిరసన మధ్య మేస్త్రి ట్రాక్టర్‌ను అక్కడే వదిలి వెళ్లిపోయినట్లు సమాచారం. సమస్యకు త్వరితగతిన పరిష్కారం చూపాలని, బకాయిలను వెంటనే చెల్లించాలని కార్మికులు డిమాండ్ చేశారు. పంచాయతీ అధికారులు జోక్యం చేసుకుని వివాదాన్ని పరిష్కరించాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# సూర్య ఘర్ అమలులో రాష్ట్రంలో అగ్రస్థానం లక్ష్యం

**బాపట్ల రక్షణ న్యూస్**



సూర్య ఘర్ యూనిట్ల స్థాపనలో బాపట్ల జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలపాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్. అధికారులను ఆదేశించారు. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన వివిధ శాఖల పనితీరును పరిశీలించారు.సౌర విద్యుత్ ద్వారా ప్రతి ఇంటిలో వెలుగులు నింపడం ప్రభుత్వ లక్ష్యమని, జిల్లాకు కేటాయించిన 24,620 సూర్య ఘర్ యూనిట్ల స్థాపనలో స్పష్టమైన పురోగతి కనబడాలని కలెక్టర్ పేర్కొన్నారు. నిరుపేద కుటుంబాలకు లబ్ధి చేకూరేలా విద్యుత్ శాఖ అధికారులు వేగంగా పనిచేయాలని సూచించారు.రైతులు పండించిన పంటలను భద్రపరచేందుకు మంజూరైన 45 గోదాములలో 20 పూర్తి కాగా, 15 నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. మిగిలిన గోదాములకు స్థలాల సమస్యను వెంటనే పరిష్కరించి ప్రత్యామ్నాయ గ్రామాలను ఎంపిక చేయాలని ఆదేశించారు. సహకార, మార్కెటింగ్ శాఖలు సంయుక్తంగా క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టాలని సూచించారు.జిల్లా ఖనిజ నిధులతో మంజూరైన అభివృద్ధి పనులు, తాగునీటి పైప్‌లైన్ నిర్మాణాలు నాణ్యతతో నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. వేటపాలెం, చిన్నగంజాం మండలాల్లో ప్రారంభమైన పనులు ఏప్రిల్ 15లోగా పూర్తి చేయాలని, నిజాంపట్నం నిర్మల్‌నగర్‌లో రూ. 1.20 కోట్లతో చేపట్టిన పనులను సమయానికి ముగించాలని సూచించారు. తాతావారిపాలెం రహదారి పనులు మార్చి నెలాఖరులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.అంగన్వాడీ భవనాల నిర్మాణం, వన్ స్టాప్ సెంటర్ 'సఖి' ప్రారంభంలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను మందలించారు. బాలసదన్, శిశు గృహ మరమ్మతులు గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు.సమావేశంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. జిల్లాలో అన్ని అభివృద్ధి పనులు సమన్వయంతో వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

# ప్రజలకు ఆర్థిక సేవలకు గోల్డ్ లోన్స్ కార్యాలయం ప్రారంభం

**గోల్డ్ లోన్ కార్యాలయం ప్రారంభోత్సవంలో పాల్గొన్న తెలుగుదేశం పార్టీ ప్రతినిధి మద్దులూరి మహేంద్రనాథ్**

**చీరాల రక్షణ న్యూస్**



చీరాల పట్టణంలోని ఏఆర్ రోడ్డులో క్యాప్రి గోల్డ్ లోన్స్ నూతన శాఖను చీరాల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి మద్దులూరి మహేంద్రనాథ్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పట్టణంలో కొత్త ఆర్థిక సంస్థలు స్థాపించబడటం స్థానిక వాణిజ్య అభివృద్ధికి తోడ్పడుతుందని పేర్కొన్నారు. చిన్న వ్యాపారులు, మహిళలు, స్వయం ఉపాధి వర్గాలకు తక్షణ ఆర్థిక సహాయం అందించే సంస్థలు అవసరమని అన్నారు. ప్రజలకు పారదర్శక సేవలు అందిస్తూ విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని సంస్థ ప్రతినిధులకు సూచించారు.ప్రస్తుతం రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తూ పెట్టుబడులను ఆకర్షించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని, ఆ దిశగా ప్రైవేట్ రంగ సంస్థలు కూడా ముందుకురావడంఅభినందనీయమని పేర్కొన్నారు. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో ఇటువంటి సంస్థలు పాత్ర పోషించాలన్నారు.కార్యక్రమంలో పార్టీ నాయకులు, వ్యాపార వర్గాల ప్రతినిధులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నూతన శాఖ ప్రారంభంతో చీరాల పట్టణంలో ఆర్థిక లావాదేవీలకు మరింత ఊతం లభిస్తుందని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు

# ప్రజల భద్రతపై రాజీ లేదు

**అసాంఘిక కార్యకలాపాలకు కఠిన హెచ్చరిక**

**ఒక్క ఫిర్యాదుకే తక్షణ స్పందన -- ఎమ్మెల్యే గళ్ళా మాధవి**

**గుంటూరు రక్షణ న్యూస్**



గుంటూరు నగరంలోని బృందావన్ గార్డెన్స్ ప్రాంతంలో అసాంఘిక కార్యకలాపాలు సాగుతున్నాయన్న ఫిర్యాదు అందుకున్న వెంటనే స్పందించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రజల భద్రతే ప్రాధాన్యమని స్పష్టం చేశారు.గళ్ళా మాధవి ప్రజల నుంచి ఫోన్ ద్వారా ఫిర్యాదు అందుకున్న వెంటనే ద్విచక్ర వాహనంపై స్వయంగా ఘటనాస్థలానికి చేరుకున్నారు. నిర్మానుష్య ప్రదేశంలో కొంతమంది యువకులు గంజాయి సేవిస్తూ స్థానికులకు ఇబ్బందులు కలిగిస్తున్నారని ఓ మహిళ ఫిర్యాదు చేయగా, ఎమ్మెల్యే తక్షణమే స్పందించారు. ఎమ్మెల్యే రాకను గమనించిన యువకులు అక్కడి నుంచి పరారయ్యారు.

అనంతరం స్థానికులతో, ఫిర్యాదు చేసిన మహిళతో మాట్లాడి పూర్తి వివరాలు తెలుసుకున్న ఎమ్మెల్యే, ఈ తరహా ఘటనలు పునరావృతం కాకుండా క్రమం తప్పకుండా పోలీసు గస్తీ నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే అసాంఘిక కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని ఆమె స్పష్టం చేశారు.ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణలో ఎలాంటి రాజీ ఉండదని పేర్కొంటూ, సమస్యలపై వెంటనే స్పందించే ప్రజాప్రతినిధిగా వ్యవహరించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ప్రజలకు అండగా నిలుస్తానన్న తన నిబద్ధతను ఎమ్మెల్యే గళ్ళా మాధవి గారు మరోసారి నిరూపించారని వారు అభిప్రాయపడ్డారు.